# కమ్యూనిష్టూ-కాంతం

డి. యల్. నారాయణరావు

ఆ వేళ వాతావరణం అంతగ బాగోలేదు. ఎండ చాల తీక్షణంగవుంది. ప్రచండభానుని ప్రళయకోపాగ్నికి తట్టుకోలేక పవనుడు తోకఝూడించాడు. సాయంకాలం కావచ్చింది. అప్పటి వరకు విధివిరామములేకుండ ఫంకా లాగుతున్న రంగడి బుర్రలో ఎన్నో ఆలోచనలు తిరిగిపోతున్నాయి. కిటికీలోంచి కనుచూపుమేరలో గౌతమీ... శబరీసంగమస్థలం కనిపిస్తుంది. ఆప్రక్కనే వో పెద్ద టెలిగ్రాపు స్తంభం...దాని మీదుగ దూరంగ ఓపర్వతం... బంగారుపూత పూసే అస్తమయ సూర్యకిరణాలు .. ఆవాతావరణానికొక క్రొత్తశోభను చేకూరుస్తున్నాయి.

ఆరమణీయ ప్రకృతి చూసేసరికి తనకాంతం జ్ఞాపకం వచ్చింది రంగడికి. చిన్నప్పటినుండి నాలుగురోజుల క్రితంవరకు...తనకూ...కాంతానికి గలసంబంధం అంతాఒక్కసారి ...ఖగోళశాస్త్రజ్ఞునిముందు గ్రహాలు తిరిగినట్లు తిరిగిపోయింది. తనకాంతం ఎంతమంచిది... ఎంతతీరుగ మాట్లాడుతుంది .. తనంటే కాంతానికి ప్రేమ. ఎప్పుడూ తన్నుచూస్తూ తనదగ్గరే వుండిపోవాలనుకుందట. పిచ్చికాంతం .. అని యీప్రపంచాన్నేమరచి గతజీవిత సౌఖ్యానుభవాలను స్మరణకుతెచ్చుకొని ఆనందిస్తూన్న రంగడికి ఆఫీసరుగారి పిలుపుచెవులో బడేసరికి ఒక్కసారి ఉలిక్కిపడి అయ్యా అంటూ హాజరయ్యాడు.

ఆఫీసరుగారు నెలజీతం ముప్పయి రూపాయిలు చేతిలో పెట్టేరు...సానుభూతిగ వంగి సలాం దెబ్బగొట్టి యింటికి బయలు దేరాడు రంగడు.

కాంతం అంటే ఆవూరిలో ఎరుగనివారు లేరు. పచ్చగ సన్నగ వుంటుంది. అంత అందగత్తె గాకపోయినా.. మరీ అనాకారి అంటానికి వీలులేదు... వంపులు తిరిగిన ఆమెకుంతలాలు యెప్పుడూ చంపలతో సయ్యాటలాడుతుంటాయి... చదువురాని సామాన్య స్త్రీ అయినా... ఆమెహృదయం చాలావిశాలమైనది. తనతీయని మాటలతో యెదుటివారిని యిట్టె ఆకర్షించేది. ఆమెతో మాట్లాడుతుంటే... యింకామాట్లాడాలనిపిస్తుం దెవరికైనా .. మాటల్లోగాని, చేతల్లోగాని యెదుటి హృదయాన్ని .. నొప్పించడమంటే ఆమెకుచేతగానిపని... ఆమె యెప్పుడూ నవ్వుతూనే వుంటుంది.

అందుకే ఆమె బజారుకివస్తే .. షావుకారులంతా ఆమెనుచూస్తూ... ఆమెతోమాట్లాడుతూ తమ వ్యాపారం సంగతే మరచిపోతుంటారు

సాయంకాలం కాగానే అప్పుడే సంచారానికి వచ్చిన వనకన్యలాగా... కళ్ళనిండ కాటుక... ముఖానికి పసుపు, కుంకంబొట్టు తలనిండ గడ్డిపూవులు . చంకబిందితో బయలుదేరింది కాంతం శబరినీటికి.

కోతికి కొబ్బరికాయ దొరికినట్లు .. క్రొత్తగ నౌకరులో ప్రవేశించిన రంగడికి . జీతంరాళ్ళు చేతిలో పడగానే... ఉత్సాహంతో _ఊల పాట పాడుతూ వస్తున్నాడు.

నాలుగురోజూ నుండి తుపాకిదెబ్బకు దొరకని రంగడు... కంటపడగానే తనకష్టాలన్నీ యీడేరినట్లు చిరునవ్వు నవ్వింది కాంతం.

ప్రతిగ నవ్వేడు రంగడు.

ఒయ్యారంగ ఓరచూపుచూస్తూ "ఏంమావా ఎక్కడా కనుపించడం లేదం"టూ ఆప్యాయంగా అడిగింది.

ప్రొద్దుటినుండి ఆఫీసరుగారి అధికారంతో వేగిపోతున్న రంగడికి. . ఆప్యాయంగ అడిగిన కాంతంమాటలు అమృతపు సోనలయాయి... స్వర్గంలో వున్నట్లు భావించాడు తలపైనుండి ఎంతో భారంతగ్గినట్లు దీర్ఘంగా నిట్టూరుస్తూ.. "అయ్యగారితో రాత్రి క్యాంపునుండి వచ్చా" నని సమాధాన మిచ్చాడు.

'కొంచెం బిందెత్తి పోదువురా మావా' అని అడిగిన కాంతంమాట కాదనలేక పోయాడు... అంగీకార సూచకంగ చెయ్యి... చెయ్యికలుపు

కాని; పిచ్చాపాటీ మాట్లాడుకోంటూ కబుర్లాడు నీళ్లాటికేవుకు చేరుకున్నారు.

కబురిలో స్నానంచేస్తూన్న సావుకారు లక్ష్మయ్య; ఆలస్యమైనందుకు ఘాటుగ పలకరించాడు కొంతాన్ని తనకివ్వవలసిన బాకీగురించి.

సావుకారు వెగటుచూపు గుండెల్లోనుండి దూసుకపోయింది రంగడికి - భయంగ సావుకారువైపు... దీనంగ రంగడివైపు ఒక్కసారి చూచింది కొంతం... కొంతం కన్నీటికి కరగి నీరయి పోయాడు రంగడు-

యేమీ అనలేక జేబులోంచి అప్పుడే అందు కున్న ముప్పైరూపాయలు పైకితీసి పదిరూపాయలు సావుకారికి పారేసి - రంగడింటికి సావుకారు కొట్టుదారి పట్టేరు.

గుమ్మములోనే యెదురైన తల్లి చేతిలో పెట్టేడు... కొంతానికివ్వగా మిగిలిన యిరువది రూకలు - పదిరూపాయ లేంచేసేవురాఅంది తల్లి కోపంగ -

బ్రతికి ప్రాణాలతో బయట పడినందుకు సంతోషించ మంటూ... లోపలి కెళ్ళేడు రంగడు -

కొడుక్కు సంభవించిన విపత్తు ఏమిటో తెలియకపోయినా... ఆమాతృ హృదయం ఒక్కసారి బ్రద్దలై సురక్షితంగ యింటికి చేరుకున్న కొడుకుని కౌగలించుకొని ఘొల్లుమంది.

యీవిడ్డూరం చూడడానికి యిరుగు పొరుగు అమ్మలక్కలంతా... యింటినిండా మూగి విషయం అవగాహనకొక గుసగుసలాడ సాగేరు.

యింతలో పొరిగింటి సుబ్బమ్మగారు ... సరాసరి రంగడ్ని ప్రశ్నించింది...—

"ఏమిట్రా బాబూ! యీరంధి" అని.

అతడు దిగులుగా చెప్పేడు - "తాను ప్రక్కవూరు వెళ్ళి వస్తూండగ యెవరోయిద్దరు తెల్లచొక్కాలు వేసికొన్నదొంగలు అడ్డుకున్నారని తనుపేదవాడినని యెంతో ప్రాధేయ పడిన మీదట... పదిరూపాయలు తీసుకొని మిగిలిన యిరవైరూపాయలు యిచ్చేశారనీ యీరాత్రి యీవూరు వస్తామన్నారు... ఈవిషయం యెవరికైనా చెప్పినట్లు తెలిస్తే ప్రాణాలు తీస్తామన్నార" నీ చెప్పి బెదురుబెదురుగ దిక్కులు పరికించాడు రంగడు.

"యింకెవరూ! వాళ్లు కమ్యూనిష్టులే" అంటూ రూఢిపరచింది... ఆవీధిపెద్దగారి ముద్దు భార్య.

యింకేముంది... ఆ ఎనిమిది గంటలరాత్రి వేళ... కమ్యూనిష్టులు రానున్నారని... గ్రామ మంతా దోచుకుంటారనీ - గ్రామమంతా మారు మ్రోగిపోయింది.

తెలవార్లూ ఊరుపరిసరాలంతా గస్తీ తిరిగిన పోలీసుదళాలు... నిరుత్సాహంగా సూపర్నెంటు గారి క్యాంపు ముందుచేరారు.

"ఏం ఆచోకీ యేమేనా తెలిసినట్టేనా?" అన్నట్టుగ చూసేరు... సూపర్నెంటు గారు.

సబినస్పెక్టరు గారు సాభిప్రాయంగా హెడ్ గారి వంక చూశారు.

పోలీసుపనిలో తలనెరసిన హెడ్ గారు... దొరగారికి సలాంచేస్తూ... తన అనుభవాన్ని వ్యక్తంచేసే కంఠంతో (స్వరంతో) "చిత్తం... అయ్యా! రాత్రంతా తిరిగినా ఫలితం లేకపోయింది" కాని... నసిగాడు... రంగడివంక చూస్తూ! విపులంగ విషయాన్ని చెప్పవలసింది గ చూశారు దొరవారు.

కొంచం తమాయించుకొని - తన డబ్బు కమ్యూనిష్టు లపహరించారని... గ్రామంలో చెప్పిన వ్యక్తి... యీరంగడు... కొనివిచారించగా... అదిఅబద్ధమనీ... కొంతం అనేఅమ్మాయికీ... యితనికీ రహస్య సంబంధం వుందనీ సదరు కొంతం తీర్చవలసిన బాకీ యితడు చెల్లించాడనీ... సాక్ష్యముంది... శెలవైతే హాజరు పెట్టుకుంటాను.

"ఏమిరా! రంగా?" అన్నారు అధికార పూర్వకమైన స్వరంతో... దొరగారు.

రంగడు గడగడ లాడిపోతూ... దొరగారికి చేతులు జోడించి... "తప్పయిపోయింది బాబయ్యా! యింటి దగ్గర తెలుస్తుందని అబద్ధమాడేను యింకెప్పుడూ యిలాటి పనిచేయనని" చెంపలు వేసికొన్నాడు.

ఏపసుచు దనపు మధురస్మృతులో జ్ఞాపకం రాగా దొరగారు, ఫక్కున నవ్వి "కొంతాన్ని కమ్యూనిష్టుని చేశావు" అన్నారు.

దొరగారు నవ్వులో పోలీసుదళం నవ్వుకలసి పోయింది.

వాడి తెలివితేటలకి గ్రామస్థులంతా విరగబడి నవ్వేశారు.

కాని, అబద్ధమాడి తెల్లవార్లూ పోలీసువారికి శ్రమగలిగించిన నేరానికి శిక్షగా... రంగడిని ఆవూరి నుండి బదిలీచేశారు వాళ్ల ఆఫీసరుగారు-